6 నుంచి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ రాజగోపాల్ సెంచర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం.వీరేశం, అర్చకులు వంశీ, శ్రీనివాసులు, సామాజిక కార్యకర్తలు సురేందర్‌రెడ్డి, శివరామకృష్ణ, రామచందర్‌రావు, రాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి చొరవతో మల్లాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం రూ. 60 లక్షల నిధులు మంజూరు చేసిన సందర్భంగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నెమలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీఎం నిధులతో మల్లాపూర్ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పిర సాయిగౌడ్, బెల్లం శ్రీనివాస్, పీజీ. సుదర్శన్, జమీలా బేగం, బాలరాజ్‌గౌడ్, దంతూరి రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోయకూర బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: విద్యార్థులు చదవుతో పాటుగా అన్ని విభాగాల్లో రాణించినప్పుడే లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలలో జన్య ఫౌండేషన్, గ్లాండ్ ఫార్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగోళి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్‌లో మినీ శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్: వారాంతపు సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డా. శుభ మార్వాడ శిష్య బృందంచే నిర్వహించిన శ్రీ కృష్ణ పారిజాతం నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. శ్రీకృష్ణుని కలవడానికి వచ్చిన నారథుడు రుక్మిణిదేవీకి పారిజాత పుష్పాన్ని ఇస్తాడు. అప్పుడు విషయం తెలిసిన సత్యభామ అలుగుతుంది. అప్పుడు శ్రీకృష్ణుడు ఏకంగా పారిజాత చెట్టునే తీసుకువచ్చి పేరట్లో నాటుతాడు. ఆ పుష్పాలు రుక్మిణి దేవీ పేరట్లో వాలడం ఇద్దరికి గొడవ జరగడం లాంటి సన్నివేశాలు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి మెప్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ప్రనూష రెడ్డి, అంబికా శ్రీ, ప్రణవి, సంధ్యలు పాల్గొన్నారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం

రామంతాపూర్: డివిజన్‌లోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి వేద పండితులు, ఆలయ అర్చకులు తిరుపతాచార్య, శేషాచార్య, సీతారామాచార్యల మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయభారతి పుష్ప ప్రసాద వితరణ దాత కాసారం మహేష్ గురుస్వామి, శంకర్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జలమండలి సార్లూ.. జర దేఖో..!

- చిన్న చెరువులోకి కలుస్తున్న డ్రైనేజీ మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- శ్రీనగర్ కాలనీలో వ్యర్థాలతో రాకపోకలకు ఇబ్బంది
- శారదానగర్‌లో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



శ్రీనగర్ కాలనీ చౌరస్తా వద్ద వ్యర్థాలు వదిలిన దృశ్యం



శారదానగర్‌లో పైకి లేచి ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్ మూత





డ్రైనేజీ మురుగు నీరు చెరువులోకి చేరుతున్న దృశ్యం

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలో జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చెరువు సమీపాన మార్కండేయస్వామి దేవస్థానం వద్ద మూడు నెలల నుంచి భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి భారీగా మురుగు నీరు ప్రవహించి చిన్న చెరువులోకి కలుస్తుంది. దీంతో చెరువు నీళ్లు కలుషితమై దుర్వాసన వెదజల్లుతూ కంపు కొడుతున్నాయి. చెరువు సమీపాన ఉన్న కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. స్థానిక శారదానగర్ మూలమలుపున ఉన్న భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు మూత సరిగా లేకపోవడంతో మ్యాన్‌హోల్ మూతపైకి లేచి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా రాత్రులు వెళ్లే పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా శ్రీనగర్‌కాలనీ చౌరస్తాలో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో జలమండలి అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. అయితే ఈ పనులు పూర్తయిన తరువాత మిగిలిన సిమెంట్ రాళ్ళు, ఇతర వ్యక్తులను అక్కడే వదిలేయడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులకు పట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు సమస్యలపై దృష్టిసారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రూ. 25 వేల ఆర్థిక వితరణ



ఆలయ అభివృద్ధికి నిధులు అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో విడిది (సన్నిధానం) ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వాములు ఆలయ అభివృద్ధికి రూ. 25 వేలు శనివారం దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ విజయభారతికి అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ గురుస్వామి మాట్లాడుతూ గతంలో కూడా పలుసార్లు ఆలయ అభివృద్ధికి అయ్యప్ప స్వాముల తరపున నిధులు అందజేశామని మరో విడత రూ. 25 వేలు ఈ నెల 15న అందచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ గురుస్వామి, కుమారుడు స్వామి సంతోష్ గుప్తా, డాన్ శ్రీను, బొట్టు సాయి, కరాటే రాము, లింగం, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా

అంబర్‌పేట: ఫుట్‌పాట్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు శనివారం కొరడా ఝులిపించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ –16 డీఎంసీ మారుతీదివాకర్, ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ నేతృత్వంలో శివం రోడ్డులోని బతుకమ్మ కుంట, తిలక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం వాజ్‌పేయినగర్ రైల్వే క్రాసింగ్ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శనివారం రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ పి.మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయినగర్ రైల్వే గేట్ చాలా సమయం పాటు మూసివేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలు వారి సమస్యలపై అనేక వినతిపత్రాలు ఇస్తున్న కారణంగా ప్రతిపాదిత రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, నాయకులు బద్దం పరుశురామ్‌రెడ్డి, మేకల రాముయాదవ్ పాల్గొన్నారు.

సత్కారం

మల్లాపూర్: మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్ వ్యంగ్య రచన మ్యాన్ ఎక్ తల్వార్ అనేక్‌ను రచించిన సందర్భంగా సాహిత్య సాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైన్నైలోని ప్రతిష్టాత్మక శ్రీఇన్‌లో ఘనంగా సత్కరించారు. అనంతరం రూ.11 వేల నగదు పురస్కారాన్ని ఫౌండేషన్ చైర్ పర్సన్ శివశంకర్ అయ్యర్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ సాహిత్య ప్రాముఖ్యతపై అందరితో చర్చించడానికి గొప్ప అవకాశం వచ్చిందన్నారు. ఇంకా సృజనాత్మకతతో మరిన్ని రచనలు చేయడానికి ప్రేరణ అందించాదన్నారు. తన ప్రసిద్ధ రచనలను గుర్తించి సత్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బోడుప్పల్ యాదవ సంఘం అధ్యక్షుడిగా కొండా ఐలయ్య



ఐలయ్య యాదవ్‌ను సత్కరించిన కాలనీ ప్రతినిధులు

బోడుప్పల్: ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం అధ్యక్షుడిగా కొండా ఐలయ్య యాదవ్, సంయుక్త కార్యదర్శిగా సురేష్‌కుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు యాదవ సంఘం సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. అనంతరం వెంకటేశ్వర శివాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ఏనుగు ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షులు సత్యనారాయణ, ఎస్‌బిఎస్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దీటి గణేష్ వారికి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు.

నియామకం

గ్రేటర్ విశ్వకర్మ సంఘం అధ్యక్షులుగా బిక్షపతి చారి



రామంతాపూర్: గ్రేటర్ హైదరాబాద్ జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడిగా రామంతాపూర్‌కు చెందిన బిక్షపతిచారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్‌మోహన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిక్షపతిచారి మాట్లాడుతూ ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బాలుకోట వెంకటాచారి, మదన్‌మోహన్‌వారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్‌లో ఉన్న విశ్వకర్మయులందరినీ ఐక్యం చేసి సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి



మౌలాలి : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయాల్సిన అవసరం ఉందని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ చంద్రమౌళి అన్నారు. ఓల్డ్ సఫిల్‌గూడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం ఉదయం 'మంట లేని వంట' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేసే విధానంపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాన్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



ఇంద్రగౌడ్ (ఫైల్)

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతిచెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..కానాజిగూడ టెలికం కాలనీలో నివాసముండే రావల్కోల్ ఇంద్రగౌడ్ (59) న్యాయవాది. రోజు మాదిరిగా సికింద్రాబాద్ కోర్టులో విధులు ముగించుకుని శనివారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా కానాజిగూడ రహదారి వేద విహార్ సమీపంలో ప్రైవేటు బస్సు పక్కన నుంచి వెళుతుండగా ద్విచక్ర వాహనం బస్సు వెనుక టైరుకింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2 పరిధిలో ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేస్–2 ఫీడర్ పరిధిలోని ఇండస్ట్రీ, జూడీయాక్, లింక్‌వెల్, వీఎల్‌ఆర్ ఆటోమిషన్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డైనొటిక్ ఫీడర్ పరిధిలోని సన్‌రాక్, లాక్స్‌వెల్, వైఎస్‌ఆర్, ఆక్సీమా, ఎస్‌ఎస్‌ఎల్, మోజీకృష్ణ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

చర్లపల్లి సబ్‌స్టేషన్–1 పరిధిలో...

చర్లపల్లి సబ్‌స్టేషన్–1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాబురావు తెలిపారు. ఫేస్–1, బీఎన్‌రెడ్డినగర్, ఫేస్–5, నవోదయనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఫేస్–3, భరత్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఉప్పల్: సీపీఎం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభల పోస్టర్‌ను శనివారం ఉప్పల్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో కుత్బుల్లాపూర్ ప్రగతినగర్‌లో జరుగనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె. వెంకన్న, ఎస్. నాగరాజు, పెద్ద స్వామి పాల్గొన్నారు.

న్యాక్ ఏ గ్రేడ్‌తో మరింత బాధ్యత

లిటిల్‌ఫ్లవర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్



ఉప్పల్: న్యాక్ ఏ గ్రేడ్ రావడంతో బాధ్యత మరింత పెరిగిందని, తమ దృష్టి ఇప్పుడు అటానామస్ వైపు ఉందని కళాశాల కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్, డైరెక్టర్ జాన కల్లరక్కల్ అన్నారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాక్ ఏ గ్రేడ్ విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్, డైరెక్టర్ జాన కల్లరక్కల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల విజయంలో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యా బోధనలో మరింత అధునాతన పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులు ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కళాశాల అన్ని రంగాల్లో ఉన్నతంగా ఉండటానికి కృషిచేసిన ఉపాధ్యాయులను, ప్రిన్సిపాల్ జయంతి రెడ్డిని వారు అభినందించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న బొజ్జ రమేష్

మల్లాపూర్: దళిత జన కార్మిక విభాగం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని దళిత జన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేష్ అన్నారు. శనివారం బొజ్జ రమేష్ ఆధ్వర్యంలో నాచారం వెస్లీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై శ్రద్ధ కనబర్చి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, కోటేశ్వర్, ఉప్పల్ నియోజకవర్గం మైనార్టీ సెల్ ఇన్‌చార్జి సయ్యద్ మాజిద్, దళిత జన సమితి నాయకులు ఇప్పల కుమార్, గంధం కళ్యాణ్, రవి, మహేష్, సంజయ్ పాల్గొన్నారు.

ఒకే వ్యక్తికి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



రాంబాబు

ఉప్పల్: ఒకే వ్యక్తి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అబ్బురపరిచాడు. ఒక ఉద్యోగం కోసం నానా తంటాలు పడుతున్న ఈ రోజుల్లో ఇలా ఒకే వ్యక్తి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఆయన ప్రతిభే అని పలువురు మెచ్చుకుంటున్నారు. ఉప్పల్ పారిశ్రామిక వాడ లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన మేస్త్రీ శ్రీను కుమారుడు పాలేటి రాంబాబు బీటెక్ మెకానికల్ పూర్తి చేశాడు. ఆ తరువాత వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నిర్విరామంగా శ్రమించి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షలు రాశాడు. దీనిలో భాగంగా ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో హైకోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం లభించింది. మార్చిలో ఉద్యోగంలో చేరాడు. అయినా కూడా పట్టుదల వదలక గ్రూప్ –4 పరీక్ష రాయడంతో అందులో కూడా వార్డు ఆఫీసర్‌గా సెలక్ట్ అయ్యాడు. దీంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీలో ఇష్యూ నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభచాటి మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌గా సెలక్ట్ కావడం విశేషం. అయితే ప్రస్తుతం ఏ జాబ్‌లో కొనసాగలన్న మీమాంశలో రాంబాబు ఉన్నాడు.

శుభకార్యానికి వచ్చి మృత్యు ఒడిలోకి..

కారు కిందపడి చిన్నారి అక్కడికక్కడే మృతి



ఆద్య (ఫైల్)

కుషాయిగూడ: బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చిన ఓ చిన్నారి కారు కిందపడి మృతి చెందిన పడిన సంఘటన శనివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కమలానగర్, మేడిపల్లికి చెందిన రమేష్ ప్రైవేటు ఉద్యోగి కాగా, తన కుటుంబ సభ్యులతో కలిసి చర్లపల్లిలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చాడు. ఈ క్రమంలో అతడి కూతురు ఆద్య (9) ఇంటి బయట ఆడుకుంటుండగా కారు రివర్స్ తీసే క్రమంలో కారు కిందపడి తీవ్రగాయాలపాలైంది. చిన్నారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



ఉప్పల్: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి అభివృద్ధి పనులపై ఆరా తీశారు. త్వరలో ఉప్పల్‌లో రూ.16.63 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డుపై లీకైన ఆయిల్

అదుపుతప్పిన వాహనదారులు... పలువురికి గాయాలు



ఆయిల్ లీకై ప్రమాదానికి గురైన వాహనదారులు..

కుషాయిగూడ: ఆయిల్ ట్యాంకర్ నుంచి ఆయిల్ లీకు కావడంతో పలువురు వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలైన సంఘటన శనివారం కుషాయిగూడలో చోటుచేసుకుంది. ఓ గుర్తు తెలియని ఆయిల్ ట్యాంకర్ నుంచి ఆయిల్ లీకై కుషాయిగూడ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి చక్రిపురం వరకు రోడ్డుపై ఆయిల్ పడిపోయింది. ఈ క్రమంలో అటువైపుగా వెళ్లిన పలు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో సుమారు 50 మంది వాహనదారులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన కుషాయిగూడ పోలీసులు, జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ బృందం సాయంతో రోడ్డుపై మట్టిపోసి రక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడ్డ వారు పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు.